క్లుప్తంగా

ఇష్టంతో చదవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ దశరథ్

మునిపల్లి(అందోల్): ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని ఎంఈఓ దశరథ్ విద్యార్థులకు సూచించారు. శనివారం ఆయన మునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు అర్థం కాకుంటే ఒకటికి రెండు సార్లు అడిగి చెప్పించుకోవాలని సూచించారు. పదోతరగతిలో అధిక మార్కులు సాధించడం కోసం ఇప్పటి నుంచే కష్టపడాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందజేత



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బాధిత రైతులకు నష్టపరిహారాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అందజేశారు. ఇటీవల ఎనిమిది గేదెలు విద్యుత్ షాక్‌తో మృతిచెందగా.. తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ. 3.20 లక్షల నష్ట పరిహారం చెక్కులను గుమ్మడిదల, జిన్నారం మండలం కాజీపల్లికి చెందిన నలుగురు రైతులకు శనివారం పంపిణీ చేశారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. విద్యుత్‌షాక్‌తో గేదెల మృతి చెందడంపై ఆశాఖ అధికారులతో చర్చించి నష్టపరిహారం మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో గుమ్మడిదల మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కును అందజేసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి కింద రూ.7.90లక్షల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు పంపిణీ చేశారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఝరాసంగం, జహీరాబాద్ మండలాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అశోక్‌శేరి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని హనుమాన్ ఆలయంలో శనివారం ధ్వజ స్తంభాన్ని పునః ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు, మహిళలు స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, గ్రామ మాజీ సర్పంచ్ పట్నం నిర్మలాదేవి పాల్గొన్నారు.

రక్షణ చట్టాలు అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు

సంగారెడ్డి టౌన్ : న్యాయవాదులకు రక్షణ చట్టాలు అమలు చేయాలని న్యాయవాది నిజాముద్దీన్ రషీద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిర్వహించిన న్యాయవాదుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దీనిపై ప్రతీ బార్ అసోసియేషన్ నుంచి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేయాలన్నారు. నారాయణ, లలిత, సుధాకర్, శ్రీనివాస్, శ్రీధర్, మహేంద్ర పాల్గొన్నారు.

వానొస్తే.. అవస్థే

- చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్న కాలనీలు
- చెరువులను తలపిస్తున్న దారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- నామమాత్రం చర్యలు చేపడుతున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చిన్నపాటి వర్షానికే రోడ్లు, కాలనీలు జలమయమవుతున్నాయి. దారులన్నీ చెరువుల్లా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వాన పడినప్పుడు అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ కాలువలు కబ్జాలకు గురికావడం, కొన్నిచోట్ల చెత్తాచెదారంతో నిండి పోవడం కారణంగా మురుగంతా రోడ్లపైనే పారుతోంది.

వర్షపు నీరు వెళ్లేదారిలో నిర్మాణాలు?

ఒకప్పుడు భారీ వర్షం పడినా రోడ్లపై చుక్క నీరు కనిపించేది కాదు. వరద నీరంతా కాలువల ద్వారా పోయేది. ప్రస్తుతం వర్షపు నీరు వెళ్లే ప్రాంతాలలో జోరుగా నిర్మాణాలు చేపట్టడంతో



పటాన్‌చెరు రింగ్‌రోడ్డు చౌరస్తాలో జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీరు

పరిస్థితి దారుణంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు.

వరద కాలువలు మాయం

వరద కాలువలు మాయమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానికులు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు. మరి కొన్ని ప్రాంతాలలో వరద కాలువలు రాళ్లు, మట్టితో నిండిపోయాయి. వీటిని శుభ్రం చేయమని స్థానికులు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపుతాం

పట్టణమంతటా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సాయికాలనీ, సాయిభగవాన్, భ్రమరాంబ కాలనీలో బీరంగూడ కొండపై నుంచి వరద నీరు వస్తుంది. ఈ నీరు కాలనీలలోని ఇళ్లలోకి చేరుతుంది. ఆ కాలనీలలో డ్రైనేజీ నిర్మాణం జరుగుతుంది. త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతాం.

– తుమ్మల పాండు రంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అమీన్‌పూర్

సమస్యను పరిష్కరించడం లేదు



వర్షం పడితే చాలు కాలనీలో భారీగా వరద నీరు చేరుతుంది. ఆ సమయంలో అధికారులు, పాలకులు నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సమస్య అనేక ఏళ్ల నుంచి ఉంది. వర్షాలు పడితే ఇంట్లోనుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది.

– రాజయ్య, భ్రమరాంబకాలనీ, అమీన్‌పూర్

జాతీయ రహదారిపై వర్షపు నీరు

రామచంద్రాపురం, పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి, ఇస్నాపూర్ ప్రాంతంలో జాతీయ రహదారిపై వర్షం పడితే పెద్ద ఎత్తున నీరు నిలుస్తుంది. దీంతో గంటల కొద్ది ట్రాఫిక్ జాం అయ్యి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



చెక్కు అందజేస్తున్న రాంరెడ్డి, అధికారులు

మునిపల్లి(అందోల్): పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలె అందజేస్తోందని మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ హరినందన్‌రావు, తహసీల్దార్ ఆశాజ్యోతి, మాజీ ఎంపీటీసీ పాండు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్‌కుమార్ ఆయా గ్రామాలకు చెందిన 70మంది లబ్ధిదారులకు రూ.21.73.లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. త్వరలోనే రేషన్‌కార్డులు, ఇందిరమ్మ గృహాలను మంజూరు చేస్తామని తెలిపారు. ఉప తహసీల్దార్ కృపాదానం, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదం అంచున విద్యుత్ తీగలు

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి పట్టణంలోని కల్పకుంట కాలనీలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాల చుట్టూ చెట్లు, ముళ్ల పొదలు పెరిగిపోతున్నా.. పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. అసలే వర్షాకాలం.. విద్యుదాఘాతం జరిగే అవకాశం లేకపోలేదు. వారం రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ రెండుసార్లు పనిచేయకపోవడంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయితే విద్యుత్ తీగల విషయమై



ముళ్లపొదల మధ్య విద్యుత్ స్తంభం

అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ధనసిరిలో క్రీడాపోటీలు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం ధనసిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి బస్వరాజ్ ఆటల పోటీలను ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మండల స్థాయి



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ

పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు.

మత్తుకు బానిసైతే జీవితాలు నాశనం

- పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రతినిధి మాణయ్య

జోగిపేట(అందోల్)/వట్‌పల్లి(అందోల్): మాదక ద్రవ్యాలకు అలవాటుపడి విద్యార్థులు తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆకుల మాణయ్య పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జోగిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం త్రినాథరావు, చంద్రశేఖర్, ఎన్‌సీసీ అధికారి నరోత్తం కుమార్, క్లబ్ జోన్ చైర్మన్ టి.రామకృష్ణ, కోశాధికారి జి.సంతోష్, సభ్యులు ఎం.మల్లేశం, పీడీ వీబీ శ్రీనివాస్ తదితరులు



జోగిపేట పాఠశాలలో మాట్లాడుతున్న మాణయ్య

పాల్గొన్నారు. అలాగే వట్‌పల్లి మండలంలోని పోతులబోగూడ మోడల్ పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోహినోద్దీన్ మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన నిర్వహించారు. వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సెక్రెటరీ సిద్ధేశ్వర్, డిస్ట్రిక్ట్ మెంబర్ పెద్దన్న, వైద్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులను నియమించాలి

నారాయణఖేడ్: ఖేడ్ మండలంలో ఖాళీగా ఉన్న పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించాలని మండల తాజా మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్ నాయక్ ఉన్నతాధికారులను కోరారు. శనివారం మాట్లాడుతూ.. మండలంలో 50 పంచాయతీలు ఉండగా, అధికారుల బదిలీలతో 24 పంచాయతీలకు ప్రత్యేక అధికారులు లేకపోగా.. పలు పంచాయతీలకు కార్యదర్శులు లేరని తెలిపారు. దీంతో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పనులు పడకేశాయని అన్నారు. ఆయా పనులు చేపట్టడానికి నిధులు వెచ్చించలేని పరిస్థితి నెలకొందన్నారు. కలెక్టరు, డీపీఓ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

నూతన షోరూం ప్రారంభం



పటాన్‌చెరు టౌన్ : పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో శనివారం రామ్‌రాజ్ కాటన్ కంపెనీకి చెందిన నూతన షోరూంను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిహెచ్. ప్రవీణ్‌కుమార్ ఐఏఎస్ రిబ్బన్ కట్ చేశారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

హత్నూర (సంగారెడ్డి): గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన సంఘటన మండల కేంద్రమైన హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గురుకుల విద్యార్థుల తెలిపిన వివరాల ప్రకారం.. 9వ తరగతి చదువుతున్న బాలరాజ్‌ను టీజీపి సోషల్ ఉపాధ్యాయుడు గ్రౌండ్‌లో చెప్పుతో కొట్టాడని తోటి విద్యార్థులు ఆరోపించారు. దీంతో బాలరాజుకు ప్రైవేట్ పార్ట్స్‌పై దెబ్బలు తగలడంతో పాటు తీవ్రంగా కడుపునొప్పి రావడంతో ఉపాధ్యాయులు కొంతమంది నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో ఆగ్రహించిన తోటి విద్యార్థులు గురుకుల పాఠశాల నుంచి హత్నూర జోగిపేట ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. విద్యార్థి పై దాడి చేసిన ఉపాధ్యాయుడిని వెంటనే విధుల నుంచి తొలగించాలని నినాదాలు చేశారు. విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. దీంతో ఏఎస్ఐ రాములు సిబ్బందితో అక్కడికి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పి పాఠశాల క్యాంపస్‌లోకి పంపించారు. ఈ విషయమై పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మోహన్ శంకర్‌ను వివరణ కోరగా.. విద్యార్థికి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నామని తెలిపారు. దాడి చేసిన ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



ఆందోళన చేస్తున్న గురుకుల విద్యార్థులు

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



నారాయణఖేడ్: వివిధ వేషధారణల్లో చిన్నారులు



ఝరాసంగం(జహీరాబాద్): వేడుకల్లో చిన్నారులు



జహీరాబాద్: వేషధారణలో చిన్నారులు

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని అన్ని మండలాల పరిధిలోని పాఠశాలల్లో శనివారం ముందస్తు సంబురాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఉదయం నుంచే పాఠశాలల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, గోపికలు, యశోదల వేషధారణలతో అలరించారు. కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు ఉట్లను కొట్టగా గోపిల వేషధారణలోని చిన్నారులు నీళ్లు చల్లి సందడి చేశారు. కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు.



కల్హేర్(నారాయణఖేడ్): కద్పల్ పాఠశాలలో..



పటాన్‌చెరు : జిన్నారంలోని వివేకానంద హైస్కూల్, ప్రతిభా విద్యానికేతన్ స్కూల్‌లో..



హత్నూర(సంగారెడ్డి): విజ్ఞాన్ స్కూల్లో శ్రీకృష్ణ రాధ వేషధారణలో చిన్నారులు



కొండాపూర్(సంగారెడ్డి): గొల్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో..

ప్రతీ హిందువుకు వీహెచ్‌పీ వెన్నెముకలాంటిది



మాట్లాడుతున్న సత్యం

జోగిపేట(అందోల్): ప్రతీ హిందువుకు విశ్వహిందూ పరిషత్ వెన్నుముక లాంటిదని వీహెచ్‌పీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ గుమ్మల్ల సత్యం అన్నారు. వీహెచ్‌పీ స్థాపించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం జోగిపేటలో షష్టి పూర్తి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సత్యం జీ మాట్లాడారు. 1964 సంవత్సరం శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజున ముంబయి సమీపంలోని సాందీపని ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్‌ను స్థాపించామన్నారు. సెకండ్ చీఫ్ శ్రీ గురూజీ స్థాపించిన తమ సంఘం ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని, చరిత్రలో నిలిచిపోయే అయోధ్య వంటి భారీ ఉద్యమాలు చేపట్టి, విజయం సాధించిందని ఆనందం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆహ్వానం

నారాయణఖేడ్: ఖేడ్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి 9వ వర్ధంతి సభను ఆదివారం ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శనివారం కిష్టారెడ్డి కుమారుడు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి, అఖిలభారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్‌కు అందజేశారు.

◆ నేడు మందుల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం బెల్ కమ్యూనిటీ సెంటర్‌లో ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు బెల్ అధికారులు శనివారం తెలిపారు. బెల్ కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ కార్మికులకు రూ.26 వేతనం ఇవ్వాలి

సంగారెడ్డి: పట్టణంలోని మెడికల్ కళాశాల ఆవరణలో శనివారం మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు.

◆ కాలనీ విభజన చేయవద్దు

జహీరాబాద్: మున్సిపల్ వార్డుల ఏర్పాటు సందర్భంగా కాలనీ విభజన చేయవద్దని మహేంద్ర కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. శనివారం ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాలనీ నుంచి ఆనంద్‌నగర్ కాలనీని ఇతర వార్డులో చేర్చారన్నారు. ఇలా చేయడంతో కాలనీ విడిపోయినట్లు అవుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి కాలనీ మొత్తం ఒకే వార్డులో ఉండేలా చూడాలని వారు కోరారు.

◆ నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్

సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి శనివారం సంగారెడ్డి రూరల్ కానిస్టేబుల్ మహేందర్, హోంగార్డు లక్ష్మణ్‌లు తిరిగి అందించి నిజాయితీ చాటుకున్నారు. 23వ తేదీన రాత్రి నైట్ డ్యూటీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్, హోంగార్డుకు రూ.70వేల విలువ గల సెల్‌ఫోన్ దొరికింది. దీనిని సదాశివపేట మండలం ఆరూర్ కు చెందిన మనోజ్ కుమార్‌దిగా గుర్తించి అందించారు.

◆ ఉచిత వైద్యం అభినందనీయం

హత్నూర (సంగారెడ్డి): పేదలకు ఉచిత వైద్యం అందించడం అభినందనీయమని ఎంపీడీఓ శంకర్ అన్నారు. శనివారం నస్తిపూర్ గ్రామంలో సంగారెడ్డి వెల్నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 200 మందికి పైగా ఈసీజీ, షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ యూసుఫ్, వైద్యురాలు మౌనిక, శివరామకృష్ణ పాల్గొన్నారు.

◆ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సంగారెడ్డి : వర్షాకాలంలో విష జ్వరాలు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ శ్రీకాంత్ అన్నారు. డ్రైడే సందర్భంగా మున్సిపాలిటీలోని 8వ వార్డులో కళాకారులతో శనివారం ప్రదర్శన నిర్వహించారు.

◆ అట్టహాసంగా 'ఫ్రెషర్స్ డే'

సంగారెడ్డి : సెయింట్ అంథోని జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే ను నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ సాలోమన్‌రెడ్డి పాల్గొని ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు జ్ఞాపికలు, మెడల్స్ అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, ఆంథోనీస్ సంస్థల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ జయబాలరెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు .

◆ యువకుడు అదృశ్యం



షేక్ రహమాన్

సంగారెడ్డి టౌన్ : యువకుడు అదృశ్యమైన సంఘటన పట్టణంలోని శాంతినగర్ లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ నగర్‌లోని మసీదులో షేక్ రహమాన్ (13) మదర్సా పాఠశాలల్లో చదువుతున్నాడు. ఈ నెల 19న ఉదయం ఎవరికీ చెప్పకుండా పాఠశాల నుంచి వెళ్లిపోయాడని టీచర్ వారి తల్లి షబానా బేగంకు సమాచారం ఇచ్చింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసినవారు 8712656718 నంబర్‌లో తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

◆ ముగిసిన ఎస్‌జీఎఫ్ గేమ్స్

కల్హేర్(నారాయణఖేడ్): మార్డిలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్ శనివారం ముగిశాయి. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అంజయ్య, హెచ్ఎంలు శ్రీనివాస్, రాములు, టీచర్లు పాల్గొన్నారు.

◆ దాబాలపై పోలీసుల దాడులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని ఎంఆర్ఎఫ్, ఆరూర్ గ్రామ శివారులోని పలు దాబాలపై సీఐ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. వాటిల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగడానికి అనుమతినిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు సాయి దాబా యజమాని గౌండ్ల రాజగౌడ్, చౌదరి దాబా యజమాని పట్నం సాయి కిరణ్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

◆ తాగునీరు వృథా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మండలంలోని వెలిమెల నుంచి రింగ్ రోడ్డు వెళ్లే మార్గంలో మంజీరా పైప్ లైన్ వద్ద వాల్ కట్టేయలేదు. తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

◆ డెంగీపై అప్రమత్తం



పటాన్‌చెరు టౌన్: డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పటాన్‌చెరు ఎంపీడీఓ యాదగిరి అన్నారు. కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు జిల్లా కళా బృందం పటాన్‌చెరు మండలం చిన్న కంజర్లలో కళా ప్రదర్శన నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందుకు గ్రామపంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాన్ని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కళా ప్రదర్శన ద్వారా గ్రామాల్లోని ప్రజలను చైతన్యం చేస్తున్న కళాకారులను అభినందించారు.